# 3. బయట అమావాస్య లోపల పౌర్ణమి

బస్సు దిగడం తరువాయి, భానుమూర్తి సరాసరి ఇంటికి దారి తీశాడు. పక్కనున్న స్నేహితుడు, 'ఎందుకోయ్ అంత తొందర?' అంటూ ఉన్నా ఆ మాటలు పట్టించుకోలేదు. తన రాక కోసం ఒళ్లంతా కళ్లుచేసుకుని తన భార్య—అగ్నిసాక్షిగా పెళ్లిచేసుకున్న భార్య—నిరీక్షిస్తూ ఉంటుంది. నిన్న బజారుకి తీసుకు వెడతానన్నాడు. కాని, తీసుకు వెళ్లలేకపోయాడు. ఈవేళ తప్పదన్నాడు. ఆమె ముస్తాబై సిద్ధంగా ఉంటుంది. తాను ఆలస్యం చేయకూడ దనుకున్నాడు.

ఇంటి కింకా బారెడు దూరంలో ఉన్నాడు. వీధి వాకిట్లో ఆమె నిలబడి ఉండటం భానుమూర్తి చూశాడు. ఎందుకలా నుంచుంది? అనుకున్నాడు. ఎంత సేపటినుంచి నుంచుందో? తన్ను తాను ప్రశ్నించుకున్నాడు. సమాధానం రాలేదు. అందుకు బదులుగా సందేహం ప్రత్యక్ష మయింది. ఒకక్షణంలో ఆ సందేహం మొగ్గలు తొడిగింది. అది పిందెలు వేయకమునుపే అతను ఇల్లు చేరుకున్నాడు.

భర్తను చూచీ చూడటంతోనే ఆమె మెరుపుతీగలా లోపలికి వెళ్లిపోయింది, పైకి పొంగివస్తున్న సంతోషాన్ని కప్పిపుచ్చుకుంటూ. అతను ఆమెను అనుసరించాడు—బద్ధకంగా, నీరసంగా.

ఆమె కాపరానికి వచ్చి ఇంకా పట్టుమని పదిరోజులైనా కాలేదు. కాని, ఈ తక్కువ కాలంలోనే వాళ్లిద్దరూ చిలకా గోరింక లనిపించుకున్నారు. దేహాలు వేరయినా, ఆత్మలు ఒక్కటే అని గుసగుసలాడారు ఇరుగుపొరుగు అమ్మలక్కలు.

కాని, ఈవేళ భానుమూర్తి పెదవుల మీద మందహాసం కనిపించలేదు. మాటల్లో తేనెసోనలు స్రవించలేదు. చూపుల్లో ప్రేమవాహిని పొంగలేదు. మరి, మనస్సు...

ఆమె నిర్ఘాంతపోయింది.

'ఎందుకండీ ఇలా వున్నారు?' అని అడిగే ధైర్యం ఆమె కింకా రాలేదు. అప్పటికీ ఆమె అతనివైపు సాభిప్రాయంగా ఒకటి రెండుసార్లు చూసింది. అతను ముభావంగా ఉన్నాడు.

ఇంతలో ఆమె లోపలికి వెళ్లి, ఉప్మాపళ్లెంతో తిరిగి వచ్చి, పళ్లెం అతని ముందుంచింది.

ఉప్మా కొంచెం నోట్లో పెట్టుకుని, 'ఇంట్లో ఉప్పు అయిపోయిందా?' అన్నాడు వెటకారంగా.

అతనిలా ఆమె చదువుకోకపోయినా, ఆ వెటకారాన్ని ఆమె గ్రహించక పోలేదు. మొన్న చేసినట్లుగానే, ఈవేళ కూడా ఉప్మా చేసింది. పైగా ఈవేళ అల్లంముక్కలు వేసింది; నిమ్మరసం పిండింది. ఆమె కొంచెం రుచి చూసింది కూడా. ఎంతో బాగుంది. తప్పకుండా అతను మెచ్చుకుంటాడని ఆశించింది. అయితే, అతను ఎందుకిలా ప్రవర్తిస్తున్నాడు? ఆలోచనలతో మెదడు వేడెక్కింది.

ఆలోచనల డోలికలో ఆమె ఊగుతున్నా, అతను మాత్రం పళ్లెం ఖాళీచేశాడు, లోలోపల మెచ్చుకుంటూ. మరికొంచెం

అడుగుదామనుకున్నాడు. కాని, మొదట్లోనే వంక పెట్టినందుకు అడగలేకపోయాడు. ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరవుతున్న ఆమె కూడా అడగడం మరిచిపోయింది.

'నువ్వు సిద్ధమైనట్టున్నావు. బజారుకి వెడదామా?' అడిగాడు భానుమూర్తి లాంఛనప్రాయంగా.

'వద్దు లెండి' అమె బదులు చెప్పింది.

తలనొప్పి తగ్గినవాడిలా కనిపించాడు అతను. చదవాలని లేకపోయినా, అలమరలోంచి ఒక పుస్తకం తీసి పుటలు తిప్పడం మొదలుపెట్టాడు.

ఆమె వంటింట్లోకి వెళ్ళిపోయింది, తనకంటూ ఒక గది లేకపోవడంవల్ల. చాప పరుచుకుని కూర్చుంది. పెనుగాలికి పైకి లేస్తూ, కింద పడుతూ అల్లల్లాడే ఆకులా, ఆలోచనల గాలిలో ఆమె లేతమనస్సు అటూ ఇటూ కదలసాగింది.

భానుమూర్తికేమీ తోచలేదు. చదువుతున్నట్టు నటిస్తున్న పుస్తకాన్ని మూసివేశాడు. తన మనస్తత్వంవల్ల అనవసరంగా ఇంట్లో వాతావరణం కలుషితమయినందుకు విచారించాడు.

ఆమె లోపల ఏంచేస్తున్నదో అని తహతహలాడిపోయాడు. వంటింట్లోకి తొంగి చూశాడు.

తల వంచుకుని ఆమె కూర్చుంది. కుడి చేతివేళ్ళతో చాప మీద సున్నాలు చుడుతోంది.

'లలితా!' అన్నాడు భానుమూర్తి.

ఆ పిలుపుకే ఆమె సంతోషించింది. ఎడారిలో నీళ్లు కనిపించినట్టుగా భావించింది. అకాలంలో కోకిల కూత

వినిపించినట్టుగా అనుకుంది. మండుటెండలో పయనిస్తున్న బాటసారికి చల్లని నీడ కనిపించినట్టుగా తలచింది.

లలిత భర్తను సమీపించింది. అతను మాట్లాడే లోపల ఆమె 'మీ మౌనం భరించలేను' అంది. ఆమె కళ్లు చెమ్మగిల్లాయి. అతను ఆప్యాయంగా 'లలితా!' అనగలిగాడు. అంతకు మించి మరేమీ అనలేకపోయాడు.

భర్త కళ్లల్లోకి చూస్తూ లలిత అంది: 'పక్క భాగం వాళ్లేమో మలయాళీలు. పైన ఏమో బెంగాలీవారు. వాళ్ల భాష నాకు తెలీదు. నా భాష వాళ్లకు తెలీదు. ఇంక నే నెవరితో మాట్లాడతాను? ఎంతసేపని పత్రికలూ అవీ చదవను?'

'అవును.'

'ఈ తిరువనంతపురంలో నా కెవరండీ ఆప్తులుగానీ, బంధువులు గానీ...మీరలా బెల్లంకొట్టిన రాయిలా కూర్చుంటే, నా కష్టసుఖాలు నే నెవరితో చెప్పుకుంటాను...' లలిత ఇక మాట్లాడలేకపోయింది. ఆమె కళ్లు నీటిబుంగలయినాయి.

భానుమూర్తి పశ్చాత్తాపం చెందాడు. అతని నవనీత హృదయం కరిగిపోయింది. 'ఈ ఊళ్లో నాకు మాత్రం ఎవరున్నా రని—నీకు నేను, నాకు నువ్వూను' అంటూ పసిపిల్లవాడిలా బావురుమన్నాడు.

'ఊరుకోండి, ఎవరన్నా చూస్తే...' ఆమె తన చీర కొంగుతో అతని కళ్లు తుడిచింది. లోగుండెలలో ఎంతో కష్టం కొద్దీ దాచుకున్న సంతోషాన్ని ఒక్కసారిగా పైకి

తెచ్చుకొని చిరునవ్వు నవ్వింది. ఆ చిరునవ్వుతో ఆ గదిలో వెలుగు వెల్లువ ప్రవహించినట్లయింది.

బయట వీధిదీపాలు అప్పుడే వెలిగాయి.

భానుమూర్తి మనస్సు తేలికపడింది. 'అనవసరంగా నిన్ను అపార్థం చేసుకున్నాను, లలితా!' అన్నాడు.

ఆమె ఏమీ చెప్పలేదు. అతని వైపు జాలిగా చూసింది. ఇంకెప్పుడూ అలా అపార్థం చేసుకోవద్దు అన్నట్టుగా ఉంది ఆ జాలి చూపు.

'అలా గుడిదాకా వెళ్లి వద్దాం, లలితా' అంటూ అతను స్నానాల గదికి వెళ్లాడు.

ఆమె పూర్వపు లలిత అయింది.

స్నానం చేస్తున్నంతసేపూ, ఆతరవాత ఆలయంలో భగవత్సన్నిధానంలో ఉన్నంతసేపూ భానుమూర్తి ఆత్మ విమర్శ చేసుకున్నాడు. 'నేను ఎమ్.ఏ., దాకా చదువుకున్నాను. ఆమె అంతగా చదువుకోలేదు. కాని, ఆమెకున్న సంస్కారం నాకు లేదు. మనిషికి కావలసింది సంస్కారం గాని, డిగ్రీల చదువు కాదు...'

'సంస్కారం గల ప్రతి భార్యా తన భర్తను ప్రేమిస్తుంది. ఆ ప్రేమను అనవసరమైన సందేహాలతో వమ్ము చేసుకో కూడదు. నేను లలితను పెళ్లి చేసుకున్నది ఆమె ప్రేమను పొందడానికీ, ఆమెను సుఖపెట్టడానికీను...స్వామీ! ఎల్ల వేళల్లోనూ నా భార్యను ప్రేమించే నిండు మనస్సు నాకు ప్రసాదించు...'

ఆ రాత్రి భోజనానంతరం లలిత వంటిల్లు కడుగుతూ ఉంటే, భానుమూర్తి తమ పెళ్లి ఫోటోలోని లలితను చూస్తూ, 'లలితా! నన్ను క్షమించు' అన్నాడు. ఆమెతోనే ఆ మాట అనాలనుకున్నాడు మొదట్లో. కాని, అలా అనడానికి సిగ్గు పడ్డాడు. తాను భర్త గదా!

ఆ రాత్రి ఆ ఇంట్లో సంతోషం మెరిసింది. వెన్నెల విరిసింది. అమృతం కురిసింది.

లోకానికి ఆ రోజు అమావాస్య!

ఆ దంపతులకు ఆ రోజు పౌర్ణమి!